E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 19-05-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:136|| పేజీలు–6
www.ekaburu.com

భూముల ధరలు భగ్గుమంటున్నాయి!

భూముల ధరల భారీ పెంపు! కొత్త మార్కెట్ రేట్లు త్వరలో అమలు

50% వరకు ఆస్తుల విలువ పెంపు

ప్రభుత్వం కీలక కసరత్తు

ఓఆర్ఆర్ పరిధిలో భూముల ధరలకు భారీ సవరణ సిద్ధం

అపార్ట్‌మెంట్ల చ.అడుగు ధర రూ.6,000 వరకు పెరిగే అవకాశం

స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖకు రూ.1,500 కోట్ల అదనపు ఆదాయం అంచనా

ఈకబురు, హైదరాబాద్:రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూముల ప్రభుత్వ విలువను మూడు రకాలుగా సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాలు, జాతీయ, ప్రధాన రహదారులు, మండల కేంద్రాలు, పట్టణాలకు సమీపంలోని భూముల విలువను సవరించనున్నారు.

మిగతా 2లో

హరిత ఇంధనంలో

సమష్టి కృషి

నార్వే ప్రధానితో భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు

ఈ-కబురు,ఓస్లో: యూరప్ పర్యటనలో ఉన్న భారత ప్రధాని మోదీ నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్‌తో శుద్ధ ఇంధనంలో సమష్టి కృషే ధ్యేయంగా హరిత వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నారు. శుద్ధ ఇంధనం మొదలు వాతావరణ మార్పులను తట్టుకోవడం,

1,265 రోజుల జాప్యం ఎందుకు?

- 7.14 ఎకరాల భూమిని కాపాడే విషయంలో అధికారులకు ఇంత నిర్లక్ష్యమా
- ప్రత్యేక కమిటీతో సీఎస్ దర్యాప్తు జరిపించాలి
- అవసరమైతే మేమే ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశిస్తాం
- బంజారాహిల్స్ భూ వివాదం కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం

ఈ-కబురు, ఢిల్లీ:

హైదరాబాద్ బంజారాహిల్స్ షేక్‌పేట పరిధిలోని 7.14 ఎకరాల భూ వివాదానికి సంబంధించి 2021 సెప్టెంబరు 29న హైకోర్టు ఇచ్చిన తీర్పును

03

బండి సంజయ్ తప్పు చేయలేదు:

రాంచందర్‌రావు

మీ స్పందన, హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్‌తోపాటు భాజపాపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. వ్యక్తిని, కుటుంబ సభ్యులను

కేరళ సీఎంగా సతీశన్ ప్రమాణం

ఐదేళ్లలో అభివృద్ధి చేస్తాం

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల రూపు రేఖలు మార్చడమే మా లక్ష్యం

నిర్దేశిత లక్ష్యంలోగా మావోయిస్టులను నిర్మూలించాం

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెల్లడి

యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో పాల్గొన్న అధికారులకు సత్కారం

ఈకబురు, హైదరాబాద్: రాబోయే ఐదేళ్లలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల రూపురేఖలు మార్చడం తమ తదుపరి లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. నిర్దేశిత లక్ష్యం 2026 మార్చి 31లోగా దేశంలో మావోయిస్టులను నిర్మూలించడంలో కృషి చేసిన పోలీసులు, భద్రతా బలగాలను సోమవారం జగదల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు.

మిగతా 2లో

ఇక నుంచి

క్యాలెండర్ ప్రకారమే...

ఈ-కబురు,అమరావతి, మే 18:

ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో 25 ఇరిగేషన్ ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ ను సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర సచివాలయంలో పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. దీంట్లో భాగంగా ఇరిగేషన్ క్యాలెండర్ అంశంపై చర్చించారు. గతంలో ప్రకటించిన ప్రాజెక్టులు కాకుండా...ప్రాధాన్యత కలిగిన మరో 11 ప్రాజెక్టుల పనులు కూడా చేపట్టాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ఆ మేరకు ఆ 11 ప్రాజెక్టులను ఇరిగేషన్ క్యాలెండరులో చేర్చాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను సూచించారు. గతంలో ప్రకటించిన 25...సమీక్షలో ప్రకటించిన 11 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా తీసుకుని ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్ కు అనుగుణంగా పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో

కాంగ్రెస్ రెండున్నరేళ్లలో

చేసిందేమీ లేదు

ఈ-కబురు, హైదరాబాద్ :

'తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ చచ్చుడో..'అనే నినాదంతో ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసిన మహానాయకుడు కేసీఆర్ పోరాట పటిమ వల్లే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గతంలో ఎప్పుడూ జరగని స్థాయిలో అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో చేసిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఒక మైనర్ బాలికపై అత్యాచారం జరిగితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. 8 రోజులుగా కొడుకును దాచిపెట్టి, బాలిక కుటుంబ సభ్యులను బెదిరించి, మీడియా నోరు నొక్కిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని, నిష్పాక్షికంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆదివారం హస్తినాపురంలోని జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఎల్‌బీనగర్ నియోజకవర్గం బూత్

02

ఏఐతో సోషల్ మీడియాపై

నిఘా..

- హైదరాబాద్ పోలీసుల చేతికి సరికొత్త అస్త్రం
- ఆ శక్తుల ఆటకట్టిస్తాం..: సజ్జనార్
- ప్రయోగాత్మక దశలోనే అద్భుత పనితీరు..
- వైరల్ చేసే ఖాతాల్ని ఇట్టే పట్టేస్తుంది..

ఈ-కబురు, సామాజిక మాధ్యమాల్లో విద్వేషాల్ని రెచ్చగొట్టేవారిపై ఉక్కుపాదం మోపేందుకు హైదరాబాద్ నగర పోలీసులు సరికొత్త అస్త్రంతో ముందుకొచ్చారు.

మిగతా 3లో

టీఆర్ఎస్ జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ

02

సీఎస్‌కేపై గెలుపు.. ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లిన సన్‌రైజర్స్

ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 70) అద్భుత ఆటతీరుతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టింది. అటు తమ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే...

టీఆర్ఎస్ జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ

–నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ

–టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

ఈకబురు, హైదరాబాద్ :
రాష్ట్రవ్యాప్తంగా ఒకే మోడల్ లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెలు నిర్మిస్తున్నామని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. బంజారా హిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో జెండా గద్దెల మోడల్ ను ఆవిష్కరించారు
మూడు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతో పార్టీ జెండా గద్దెలు నిర్మించాలని సూచించారు.పార్టీ జెండా గద్ది బేస్ ఒక ఫీట్ ఎత్తులో ఉంటుందని పైభాగం మరో రెండు ఫీట్ల ఎత్తులో ఉంటుందని తెలిపారు.జెండా గద్ది బేస్ కు గ్రీన్ కలర్.. పై భాగంలో ఉండే జెండా గద్ది కు ఎల్లో కలర్, దాని మధ్యలో తెలంగాణ మ్యాప్ బ్లూ కలర్ లో ఏర్పాటు చేయాలని సూచించారు. లంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లీష్ అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలని సూచించారు.జెండా గద్ది బేస్ గ్రీన్ కలర్ మధ్యలో తెలుగులో తెలంగాణ రక్షణ సేన అని రాయాలని సూచించారు. పార్టీ జెండా కలర్ కోడ్స్ కూడా తాము ఇచ్చిన విధంగానే చూసుకోవాలని.. అప్పుడే రాష్ట్రవ్యాప్తంగా జెండాలన్నీ ఏకరూపంలో ఉంటాయని వెల్లడించారు. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు

కాంగ్రెస్ రెండున్నరేళ్లలో చేసిందేమీ లేదు

ఆదివారం హస్తినాపురంలోని జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఎల్‌బీనగర్ నియోజకవర్గం బూత్ లెవెల్ ఏజెంట్లు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: 'గతంలో నిజాం ప్రభుత్వ హయాంలో గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు ఆసుపత్రుల నిర్మాణం జరిగితే, బీఆర్ఎస్ హయాంలో 4 ఆసుపత్రుల నిర్మాణం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 2.5 లక్షల మందికి ఇళ్లు కట్టించి ఇస్తే, రేవంత్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తోంది. మైనర్ బాలిక విషయమై బీఆర్ఎస్ మహిళా విభాగం, పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోరాడుతున్నారు. తమకు న్యాయం చేయాలని పోరాడుతున్న బాలిక తల్లిదండ్రులకు సెల్యూట్ చేస్తున్నాం. బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని ఈ సమావేశంలో తీర్మానం చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను, వైఫల్యాలను బీఆర్ఎస్ శ్రేణులు ప్రజల్లోకి తీసు కెళ్ళాలి..'అని కేటీఆర్ చెప్పారు.

--'సర్'పై అప్రమత్తంగా ఉండాలి

'దేశంలో బీజేపీకి అనుకూలంగా లేని ఓట్లను తొలగిస్తున్నారు. ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియలో భాగంగా బెంగాల్, కేరళ రాష్ట్రాలలో లక్షలాది ఓట్లను తొలగించారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంపై బీఆర్ఏ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో కార్పొరేటర్లుగా పార్టీ సభ్యత్వం, కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న వారికే అవకాశం వస్తుంది. ఎల్‌బీనగర్‌లో ఉన్న 18 డివిజన్లను బీఆర్ఎస్ గెలుచుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలి..'అని కేటీఆర్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, రాజయ్య, మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు బండారు లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, నాయకులు దాసోజు శ్రవణ్, దేశపతి శ్రీనివాస్, దేవీప్రసాద్, గోలి శ్రీనివాస్‌రెడ్డి, పల్లె రవికుమార్, మాజీ కార్పొరేటర్లు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

బండి సంజయ్ తప్పు చేయలేదు: రాంచందర్‌రావు

ఈకబురు, హైదరాబాద్:
కేంద్ర మంత్రి బండి సంజయ్‌తోపాటు భాజపాపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. వ్యక్తిని, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ''బండి సంజయ్, భాజపాపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. రూ.కోట్లు ఖర్చుపెట్టి రాష్ట్రమంతా పోస్టర్లు వేయించారు. బండి సంజయ్ తప్పు చేయలేదు. ఆయన కుటుంబ సభ్యులు తప్పు చేస్తే.. న్యాయపరంగా చర్యలుంటాయి. సంజయ్‌ను లక్ష్యంగా చేసుకొని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో మహిళలపై 67 శాతం క్రైమ్ రేటు పెరిగింది. జూబ్లీహిల్స్ బాలిక కేసులో కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా?మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్తే.. రాజీనామా చేశారా? ఓ మహిళా సర్పంచి తనను బీఆర్ఎస్ ఎమ్మెల్యే లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేస్తే పార్టీ పరంగా ఏం చర్యలు తీసుకున్నారు? కేటీఆర్‌కు నైతిక విలువలు లేవు. మీ ఇంటి ఆడబిడ్డ తప్పు చేస్తే ఎందుకు రాజీనామా చేయలేదు? ప్రజా సమస్యలపై పోరాటం చేయడం చేతగాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలి. కాళేశ్వరం, ఈకారు రేస్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేయాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిశాయి కాబట్టే వారిని అరెస్టు చేయడం లేదు'' అని రామచందర్‌రావు అన్నారు.

ఐదేళ్లలో అభివృద్ధి చేస్తాం

దీంతోపాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన సేవా కేంద్రాలను నేతనార్ గ్రామంలో అమిత్ షా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. తమ దగ్గర అభివృద్ధి జరగకపోవడం వల్లే ఆయుధాలు చేపట్టామనే తప్పుడు ప్రచారం చేస్తూ మావోయిస్టులు బస్తర్ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఇటీవల మూడు వేల మంది మావోయిస్టులు లొంగిపోతే, అందులో రెండు వేల మందికి కనీసం రాయడం, చదవడం రాదని, ఈ ప్రాంతానికి మావోయిస్టులు చేసిన అన్యాయాలకు ఇదో ఉదాహరణ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేసిన కృషితో ఈ ప్రాంతం నుంచి మావోయిస్టులను నిర్మూలించామని పేర్కొన్నారు.

15 శాతం బస్తర్ ఆదివాసీల కోసం...

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సూచనలతో బస్తర్‌లో గుజరాత్ తరహాలో పాడి పరిశ్రమ అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందని అమిత్ షా చెప్పారు. ఇకపై వచ్చే ఉద్యోగాల భర్తీ ప్రకటనల్లో 15 శాతం ఉద్యోగాలను బస్తర్ ఆదివాసీల కోసం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టులను నిర్మూలించేందుకు 2018 నుంచి విస్తృత ప్రయత్నాలు జరిగాయని అమిత్‌షా అన్నారు.

ఢిల్లీలో పెద్ద పెద్ద భవనాల్లో కూర్చుని కాగితాలు, కంప్యూటర్ల మీద ఎన్నో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడానికి 2026 మార్చి 31వ తేదీని గడువుగా పెట్టుకున్నామని అమిత్ షా గుర్తుచేశారు. పై స్థాయిలో ఎన్ని ప్లాన్లు వేసినా వాటి క్షేత్రస్థాయిలో ఎలా అమలు చేస్తారనేది కీలకమని, ఆ విషయంలో వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాలు, పారా మిలిటరీ బలగాలు, స్పెషల్ ఫోర్సులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేశాయని కితాబునిచ్చారు. ఆ ఆపరేషన్‌లో పాల్గొన్న బలగాలకు ఆయన అభినందనలు తెలిపారు.

తెలంగాణకు అభినందనలు

బస్తర్‌లో మావోయిస్టుల ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ఆ పార్టీకి దిశానిర్దేశం చేసే నేతల్లో ఎక్కువ మంది తెలంగాణకు చెందిన వారున్నారు. దీంతో నిర్దేశిత గడువులోగా మావోయిస్టులను నిర్మూలించడంలో తెలంగాణ పోలీస్ అధికారులు కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో జగదల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి (మాజీ డీజీపీ), తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, మల్కాజ్‌గిరి సీపీ బి.సుమతి (ఎస్ఐబీ మాజీ చీఫ్), డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్, గ్రేహౌండ్స్) అనిల్ కుమార్‌ను అమిత్‌షా సత్కరించారు. మావోయిస్టు కార్యకలాపాల నిరోధానికి శివధర్‌రెడ్డి విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్, హోంమంత్రి విజయ్‌శర్మ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భూముల ధరలు

భగ్గుమంటున్నాయి!

ఈకబురు, హైదరాబాద్
:రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూముల ప్రభుత్వ విలువను మూడు రకాలుగా సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాలు, జాతీయ, ప్రధాన రహదారులు, మండల కేంద్రాలు, పట్టణాలకు సమీపంలోని భూముల విలువను సవరించనున్నారు. బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) లోపల ప్రాంతాల్లో బహిరంగ ధరలకు, మార్కెట్ విలువకు అంతరం భారీగా ఉంది. దీంతో స్థానిక పరిస్థితులను బట్టి మార్కెట్ విలువను సవరించాలని అంచనాకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వచ్చినట్లు తెలిసింది. మొత్తంగా సాగు, సాగేతర, స్థిరాస్తుల విలువ 50% వరకు సవరించనున్నట్లు తెలిసింది. ఈ నెల 28 నుంచి కొత్త ధరలను అమల్లోకి తీసుకురావాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించినట్లు సమాచారం. కొద్దిరోజులుగా ఈ విషయంపై శాఖ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు యంత్రాంగంతో కసరత్తు చేస్తున్నారు. సోమవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలపై ఒకేసారి ఎక్కువ మొత్తం భారంపడకుండా అమల్లోకి తేవాలని ఆయన సూచించినట్లు తెలిసింది. ఒకట్రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకోవాలనే అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు సవరించనున్న అంచనాల వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎకరా ప్రభుత్వ మార్కెట్ విలువ కనిష్ఠంగా రూ.1.75 లక్షలు ఉండగా రూ.2.75 లక్షలకు సవరించనున్నారు. ఓఆర్ఆర్ లోపల ఎకరా ప్రభుత్వ విలువ రూ.8.75 లక్షలు ఉండగా కనిష్ఠంగా రూ.15 లక్షలకు సవరించాలని నిర్ణయించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాల్లో భూముల ధర బహిరంగ మార్కెట్లో భారీగా ఉంది. వట్టినాగులపల్లి తదితర ప్రాంతాల్లో ఎకరా రూ.7080 కోట్లు పలుకుతోంది. మరికొన్నిచోట్ల రూ.150 కోట్లు కూడా ఉంది. ప్రభుత్వ విలువ రూ.22.5 కోట్ల వరకే ఉంది. దీనిని రూ.4 కోట్లు చేయనున్నారు.

అపార్ట్‌మెంట్ల చ.అడుగు విలువ రూ.6 వేలకు

రాష్ట్రంలో అపార్ట్‌మెంట్ల బహిరంగ ధరలను పరిగణనలోకి తీసుకుని రిజిస్ట్రేషన్ల మార్కెట్ విలువను ప్రభుత్వం సవరించనుంది. ఈ క్రమంలో ఫ్లాట్ల చ.అడుగు విలువ 75% వరకు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం చదరపు అడుగు రూ.3,500 నుంచి రూ.4 వేలు ఉన్నచోట దాదాపు రూ.6 వేలకు పెంచనుంది.

అదనంగా రూ.1,500 కోట్ల రాబడి

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక రాబడి ప్రస్తుతం రూ.15 వేల కోట్ల వరకు ఉంది. అధికంగా హైదరాబాద్ నగర శివార్లలోని భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లు, అపార్ట్‌మెంట్లు, హైరైజ్డ్ భవనాలు, విల్లాల రిజిస్ట్రేషన్ల ద్వారా వస్తోంది. అయినప్పటికీ బహిరంగ ధరలకు, ప్రభుత్వ విలువకు మధ్య పెద్దఎత్తున అంతరం ఉంది. 2021, 2022లో చివరిసారి వీటి సవరణ జరిగింది. దీనిని దృష్టిలో పెట్టుకుని బహిరంగ ధరలకు అనుగుణంగా సవరణ చేపట్టాలని నిర్ణయించారు. దీనివల్ల ఏటా రూ.1,500 కోట్ల వరకు రాబడి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుత సవరణ అమలు అనంతరం ఆరు నెలల తరువాత సమీక్ష చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం సూచనల మేరకు ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు సమాచారం.

350 ప్రాంతాల్లో ఒక్కో మాదిరి

హైదరాబాద్ మహానగరం పరిధిలో ధరలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో మాదిరి ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని 350 ప్రాంతాల్లో ఒక్కో తరహాలో పెంపు చేపట్టాలని భావిస్తున్నారు. ఉదాహరణకు జూబ్లీహిల్స్ ప్రాంతంలో కొన్నిచోట్ల ప్రభుత్వ విలువ చదరపు గజం రూ.80 వేల వరకు ఉండగా దీనిని రూ.90 వేలకు సవరించనున్నారు.

వాణిజ్య ప్రాంతాల్లో..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాణిజ్య ప్రాంతాల్లో విలువ సవరణ ఒకే తరహాలో ఉండేలా కసరత్తు చేస్తున్నారు. ఫ్లాట్ల చదరపు అడుగు ధర బహిరంగ మార్కెట్లో రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు ఉంది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొన్నిచోట్ల రూ.7,800 వరకు ఉంది. ఈ క్రమంలో అన్ని ప్రాంతాలను దృష్టిలోపెట్టుకుని ప్రభుత్వ విలువను రూ.6,600 చేయాలని భావిస్తున్నారు. 100 అడుగుల రోడ్లు, ఇతర అనుసంధాన రోడ్లు ఉన్న ప్రాంతాల్లో విలువ పెంపును అక్కడి బహిరంగ మార్కెట్‌ను అనుసరించి చేపట్టనున్నారు.

ఇక నుంచి క్యాలెండర్ ప్రకారమే...

నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పోలవరం పనులు

సమీక్షా సమావేశం సందర్భంగా పోలవరం సహా వివిధ సాగు నీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోలవరం ప్రాజెక్టులో సివిల్ వర్క్స్ 88 శాతం పూర్తి అయ్యాయని అధికారులు వెల్లడించారు. భూసేకరణ 93 శాతం పూర్తైందని...నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తి అయ్యిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి డయాఫ్రాం వాల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే ట్విన్ టన్నెల్స్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. ఎడమ కాలువ అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్ పనులను చేపడుతున్నట్టు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు.. వివిధ ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. హంద్రినీవా ఫేజ్ 1 లో భాగంగా కాలువల వెడల్పు 92 శాతం పూర్తి అయ్యిందని అధికారులు చెప్పారు. ఫేజ్ 2 కుప్పం పుంగనూరు కాలువల లైనింగ్ 85 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మల్యాల లిఫ్ట్ నుంచి రాయలసీమ ప్రాంతానికి తొలిసారిగా 52 టీఎంసీల నీటిని తరలించామని చెప్పారు. మొత్తంగా 432 చెరువులు పూర్తిగా నింపామని వెల్లడించారు. జూన్ 2024 నుంచి ఇప్పటి వరకూ రూ.2123 కోట్లు వ్యయం చేశామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ప్రతీ నెలా పోలవరం పనుల పురోగతిపై సమీక్షిస్తాను. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్1,2 పనులు చెప్పిన సమయానికి పూర్తి చేయాల్సిందే. ఈ ఏడాది జూలై నెల నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువ నుంచి నీరు అందివ్వాలి. ఎడమకాలువ నీరు మేఘాద్రిగడ్డకు పోలవరం జలాలు తీసుకు వెళ్లాక అక్కడి నుంచి వంశధారనాగావళిచంపావతి వరకూ నీరు వెళ్లేలా చూడాలి. మేఘాద్రి గడ్డ నుంచి చంపావతి లింక్ కు ఎంత వ్యయం అవుతుందో అధ్యయనం చేయాలి. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో చట్టప్రకారం ముందుకు వెళ్లాలి. 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితుల తరలింపును పూర్తి చేయాలి. ఎలాంటి వివాదాలు లేకుండా ఆర్ అండ్ ఆర్ వేగంగా పూర్తి కావాలి. పోలవరం స్పిల్ వే దిగువన ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. బెస్ట్ టూరిజం ప్రాంతంగా పోలవరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కావాలి."అని సీఎం సూచించారు.

వెలిగొండకు హై ప్రయార్టీ

"వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ జూలై నాటికి పూర్తి కావాలి. హెడ్ వర్క్స్, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూసేకరణ లాంటి పనుల కోసం ఇంకా రూ. 2019 కోట్లు అవసరం. టీబీఎంను తొలగించి అడ్డంకులు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ బ్యాలెన్సు పనులు వేగంగా పూర్తి కావాలి. అడవిపల్లి, శ్రీనివాసపురం నుంచి నీవా కాలువ ద్వారా చిత్తూరుకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. హంద్రీ నుంచి నీవా వరకూ నీళ్లు తీసుకెళ్లేలా ప్రాధాన్యతగా తీసుకుని పనులు పూర్తి కావాలి. నీళ్లు చూస్తే ప్రజల్లో ఓ నమ్మకం వస్తుంది. మైదుకూరు, మడకశిర లాంటి చివరి ప్రాంతాలకు నీళ్లు వెళ్లాలి. నీవాకు ఈ ఏడాది నీరు ఇచ్చేలా లక్ష్యం పెట్టుకోవాలి. కల్యాణి డ్యామ్ నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా మూలపల్లి చెరువుకు నీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువ పనులు వచ్చే ఏడాది జూలై నాటికి పూర్తి కావాలి. వరికెపుడిశెలను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంపాక్ట్ స్టడీ చేయాలి. అంతరాష్ట్ర సమస్యలు లేకుండా ప్రాజెక్టులు పూర్తి చేసుకుందాం. నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయమై కేంద్రంతో మాట్లాడదాం. గోదావరికావేరి అనుసంధానం పైనా కేంద్రంతో సంప్రదింపులు జరుపుదాం."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

ఖరీఫ్ కు నీరిచ్చే అంశంపై జలవనరుల శాఖకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం

"ఎల్ నినో లాంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు అంచనాలను సిద్ధం చేసుకుంటూ పంటలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలి. నెల్లూరు సాగు తీరును మార్చేలా చర్యలు తీసుకోవాలి. ఈసారి రెయిన్ ఫాల్ మైనస్ 3 శాతంగా ఉంది. భూగర్భ నీటి నిల్వలు 9.49 మీటర్లుగా ఉన్నాయి..గతేడాదితో పోలిస్తే 0.5 మీటర్లు ఎక్కువ ఉంది. ప్రస్తుత నీటి వనరుల్ని నింపేలా స్ట్రక్చర్ల నిర్మాణం జరగాలి. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. సాగునీటి సంఘాలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉండాలి. నీటి భద్రత అత్యంత కీలకమనే అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. కృష్ణా డెల్టాలో గతంలో ఆలస్యంగా సాగు సీజన్ ఉండేది. తుపాన్లు ప్రభావం వల్ల పంటనష్టానికి పరిహారం ఇవ్వాల్సి వచ్చేది. పట్టిసీమ ద్వారా గతంలో నీరిచ్చాం. ఈసారి సీజన్ ను ముందుకు తీసుకువచ్చేలా నిర్ణయాలు తీసుకున్నాం. వాటర్ మేనేజ్మంట్ లో ఇది కీలకమైన అంశం. మైక్రో ఇరిగేషన్ రంగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. నీటి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. జలధారజలహరతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి. ప్రస్తుతం వ్యవసాయం కోసం సుమారు రూ. 17 వేల కోట్ల మేర విద్యుత్ ఖర్చులను భరిస్తున్నాం. భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ వినియోగం తగ్గుతుంది. అప్పుడు ప్రభుత్వంపై విద్యుత్ భారం కూడా తగ్గుతోంది. అందుకే నీటి భద్రతకు ప్రాధాన్యమిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

గత పాలకుల నిర్వాకం వల్ల నిర్వీర్యమైన లిఫ్ట్ స్కీంలు

ఇరిగేషన్ రివ్యూలో భాగంగా లిఫ్ట్ స్కీంల పనితీరు మీద ముఖ్యమంత్రి సమీక్షించారు. 201419 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం లిఫ్ట్ స్కీంలకు అవసరమైన కేటాయింపులు జరిపేదని...అలాగే మరమ్మత్తులకు తగినన్ని నిధులు వెచ్చించే వాళ్లని అధికారులు తెలిపారు. అయితే 201924 మధ్య కాలంలో లిఫ్ట్ స్కీంలకు ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు జరపలేదని అధికారులు సీఎంకు వివరించారు. దీని వల్ల సుమారు 362 లిఫ్ట్ స్కీంలు నిర్వీర్యం అయ్యాయని అధికారులు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. లిఫ్ట్ స్కీంలను పునరుద్ధరించే అంశంపై చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రస్తుతం 156 లిఫ్ట్ స్కీంలు సంపూర్ణంగా... 505 స్కీంలు పాక్షికంగా పని చేస్తున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. లిఫ్ట్ స్కీంలను గాడిలో పెట్టేలా పని చేయాలని సీఎం సూచించారు. గతంలో సుమారు 10 లక్షల ఎకరాలకు లిఫ్ట్ స్కీంల ద్వారా సాగునీటిని అందించే పరిస్థితి ఉండేదని సీఎం గుర్తు చేశారు. అలాంటి వ్యవస్థలు నిర్వీర్యం కాకూడదని... వీటిని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుందని సీఎం అన్నారు. ఈ సమీక్ష సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, జలవన...

అంజయ్య నగర్ స్మశాన వాటిక పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

అధికారులను కోరిన ఆంజనేయులు సాగర్

ఈకబురు, శేరిలింగంపల్లి : అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ స్మశాన వాటిక పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ అడిషనల్ కమిషనర్ గీతా రాధికను కలిసి వినతిపత్రం అందజేశారు.

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం స్మశాన వాటికలో ప్రజలు కర్మకాండలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని ఆయన వివరించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన అడిషనల్ కమిషనర్ గీతా రాధిక టెండర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి పనులు త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంజయ్య నగర్ కాలనీ అధ్యక్షులు నరసింహ సాగర్, జి రవి సాగర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమావేశమైన ఆంజనేయులు సాగర్

ఏఐతో సోషల్ మీడియాపై నిఘా..

హైదరాబాద్ పోలీసుల చేతికి సరికొత్త అస్త్రం

ఈకబురు, సామాజిక మాధ్యమాల్లో విద్వేషాల్ని రెచ్చగొట్టేవారిపై ఉక్కుపాదం మోపేందుకు హైదరాబాద్ నగర పోలీసులు సరికొత్త అస్త్రంతో ముందుకొచ్చారు. సోషల్ మీడియా అబ్జర్వేషన్ అండ్ సైబర్ ఇంటెలిజెన్స్ (సాక్ ఐSOCEYE) పేరుతో సరికొత్త ఏఐ ఆధారిత అప్లికేషన్‌ను ప్రారంభించారు. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఆన్‌లైన్‌లో తప్పుడు ప్రచారాలు చేసే వారిని పసిగట్టడం, అసాంఘిక శక్తుల కదలికలను ఎప్పటికప్పుడు విశ్లేషించేలా ఈ అత్యాధునిక వ్యవస్థను హైదరాబాద్ పోలీస్ ఐటీ విభాగం రూపొందించింది. దీని గురించి అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

గతంలో సోషల్ మీడియా పర్యవేక్షణకు భారీగా సిబ్బంది అవసరం అవ్వడమే కాకుండా గంటల తరబడి మాన్యువల్‌గా శ్రమించాల్సి వచ్చేది. ఈ 'సాక్ ఐ' ద్వారా ఇకపై అన్నీ ఆటోమేటెడ్ పద్ధతిలో నిరంతరాయంగా జరుగుతాయి. దీనిలోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెంట్ డ్యాష్‌బోర్డ్ ద్వారా డయల్ 100 కాల్స్, అంతర్గత నిఘా సమాచారం, నగరంలో జరుగుతున్న ప్రధాన ఘటనల వివరాలను ఒకే చోట క్రోడీకరించి అధికారులకు పూర్తి స్థాయి క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తుంది.

ప్రయోగాత్మక దశలోనే అద్భుత పనితీరు..

'సాక్ ఐ' ప్రయోగాత్మక దశలోనే అద్భుత పనితీరు కనబరిచింది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన పురానాపూల్ ఎక్స్ రోడ్ ఘటనకు సంబంధించి 85 విద్వేషపూరిత, మతపరమైన సున్నితమైన అంశాలను, అలాగే గుడిమల్కాపూర్ వివాదానికి సంబంధించి పలు సోషల్ మీడియా ఖాతాల్లో ఉన్న 126 పోస్ట్‌లను ఇది గుర్తించింది. ఇటువంటి కంటెంట్‌ను సకాలంలో తొలగించేలా తక్షణ చర్యలు చేపట్టడం ద్వారా శాంతి సామరస్యాలను కాపాడటమే కాకుండా, విద్వేషాలను రేకెత్తించే వారిని గుర్తించడమూ సాధ్యమైంది. ప్రత్యేకించి మాదకద్రవ్యాల సరఫరా, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై ఈ వ్యవస్థ దృష్టి పెడుతుంది. చిన్నారులపై లైంగిక వేధింపుల కంటెంట్, సైబర్ బుల్లీయింగ్, స్టాకింగ్ వంటి అంశాలను ఏఐ మోడల్స్ స్వయంగా గుర్తించి అప్రమత్తం చేస్తాయి. పోస్టుల తీవ్రతను బట్టి వాటిని హై, మీడియం, లో రిస్క్ కేటగిరీలుగా విభజించి, అభ్యంతరకర పోస్టులను తొలగించేలా సంబంధిత సోషల్ మీడియా సంస్థలకు నివేదిస్తుంది.

వైరల్ చేసే ఖాతాల్ని ఇట్టే పట్టేస్తుంది..

నేరగాళ్ల నెట్‌వర్క్‌ని విశ్లేషించే సామర్థ్యం ఈ అప్లికేషన్ ప్రత్యేకత కావడంతో వివాదాస్పద పోస్టులను పదేపదే షేర్ చేసే వారిని, వాటిని వైరల్ చేసే ఖాతాలను ఇట్టే పట్టేస్తుంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులనూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ప్రతి ఫిర్యాదుకు ఒక యునిక్ ట్రాకింగ్ నంబర్ కేటాయించి, అది పరిష్కారమయ్యే వరకు ఎండ్‌టుఎండ్ మానిటరింగ్ చేస్తుంది. నగరంలో ప్రతిరోజూ జరిగే నిరసనలు, ర్యాలీలు, మతపరమైన ఊరేగింపుల వంటి కార్యక్రమాలపై ముందస్తు నిఘా ఉంచేందుకు 'ఈవెంట్ బేస్డ్ మానిటరింగ్' ఫీచర్‌ను ఇందులో పొందుపరిచారు. నిర్ణీత కీవర్డ్స్ ఆధారంగా సోషల్ మీడియా కార్యకలాపాలను ట్రాక్ చేస్తూ, ఏదైనా ముప్పు పొంచి ఉంటే వెంటనే పోలీసులను అప్రమత్తం చేస్తుంది.

ఆ శక్తుల ఆటకట్టిస్తాం..: సజ్జనార్

అత్యాధునిక ఏఐ సాంకేతికతతో కూడిన ఈ 'సాక్ ఐ' వ్యవస్థ పోలీసుల పనిభారాన్ని తగ్గించడమే కాకుండా, నేర నివారణలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆశాభావం వ్యక్తం చేశారు. 'సమాజంలో అశాంతిని ప్రేరేపించే శక్తుల ఆటకట్టించేందుకు, మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చేందుకు ఈ ఏఐ వ్యవస్థను రూపొందించాం. మారుతున్న కాలానికనుగుణంగా నేరగాళ్లు సామాజిక మాధ్యమాలను అస్త్రంగా చేసుకుంటున్న తరుణంలో, ఈ అత్యాధునిక సాంకేతికతతో వారిని సమర్థంగా ఎదుర్కొంటాం'' అన్నారు.

1,265 రోజుల జాప్యం ఎందుకు?

ఈకబురు, దిల్లీ: హైదరాబాద్ బంజారాహిల్స్ షేక్‌పేట పరిధిలోని 7.14 ఎకరాల భూ వివాదానికి సంబంధించి 2021 సెప్టెంబరు 29న హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం 1,265 రోజులు ఆలస్యంగా ఎస్ఎల్‌పీ దాఖలు చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లో అత్యంత విలువైన బంజారాహిల్స్ ప్రాంతంలో భూమిని కాపాడే విషయంలో అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించింది. బంజారాహిల్స్ రోడ్డు నం.12లోని సర్వే నం.129/76 పాత(329 కొత్త)లోని 7.14ఎకరాల భూమి విషయంలో పి.శేషుబాబు అనే వ్యక్తికి అనుకూలంగా కింది కోర్టు 2011లో ఇంజంక్షన్ ఆర్డర్ జారీచేసింది. దాన్ని సవాల్‌చేస్తూ 2012లో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించగా కిందికోర్టు తీర్పునే సమర్థిస్తూ 2021 సెప్టెంబరు 29న తీర్పు వెలువరించింది. దాన్ని సవాల్‌చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2025 నవంబరు 14న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ విషయంలో 1,265 రోజుల జాప్యం జరిగినట్లు సోమవారం విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది యథార్థ్ కన్సల్ జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేలతో కూడిన ధర్మాసనానికి విన్నవించారు. అప్పుడు జస్టిస్ అరవింద్‌కుమార్ జోక్యం చేసుకుంటూ ''హైదరాబాద్‌లో బంజారాహిల్స్ అత్యంత ఖరీదైన ప్రాంతం, ధనవంతులంతా అక్కడే ఉంటారని విన్నా. అక్కడ భూమికి సంబంధించిన విషయంలో ప్రభుత్వ అధికారులు ఎందుకు మిన్నకున్నారు? ఒక కమిటీ ఏర్పాటుచేసి ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించమని మీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)కి చెప్పండి. వచ్చే విచారణ తేదీ నాటికి పూర్తి వివరాలతో రండి. లేదంటే మీ అధికారులపై తీవ్ర చర్యలు తీసుకుంటాం. అధికారులు వాళ్ల(ప్రతివాదుల)తో కుమ్మక్కైనట్లు కనిపిస్తోంది'' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాకు క్షమాపణలు అవసరం లేదు..

న్యాయవాది స్పందిస్తూ క్షమాపణలు కోరగా న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్ వాటిని స్వీకరించడానికి విముఖత చూపారు. ''మాకు ఇక్కడ క్షమాపణలు అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులను రక్షించాలి. లేదంటే మీ అధికారులపై తీవ్ర చర్యలు ఉంటాయి. అవసరమైతే మేమే ఈ కేసును ప్రత్యేక దర్యాప్తునకు అప్పగిస్తాం'' అని హెచ్చరించారు. అందుకు న్యాయవాది యథార్థ్ కన్సల్ బదులిస్తూ తగు చర్యలకు తాను ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తానని ధర్మాసనానికి విన్నవించారు. తర్వాత జస్టిస్ అరవింద్‌కుమార్ స్పందిస్తూ ''ప్రస్తుతం ఆ భూమి ఏ పరిస్థితిలో ఉంది'' అని ప్రశ్నించారు. న్యాయవాది స్పందిస్తూ అది ప్రతివాదుల అధీనంలో ఉందని, వాళ్లు మూడో పార్టీకి హక్కులు కల్పించారని.. నిర్మాణాలు జరిగాయన్నారు. అక్కడి పూర్తి పరిస్థితులు తెలుసుకొని తర్వాత చెబుతానని విన్నవించారు. అందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా ఎస్ఎల్‌పీ దాఖలు చేసిన నేపథ్యంలో ఆ అంశంపైనా నోటీసులు జారీచేస్తున్నట్లు చెప్పారు. కౌంటర్ దాఖలుకు 8 వారాల సమయమిస్తూ కేసు వాయిదా వేశారు.

హరిత ఇంధనంలో సమష్టి కృషి

ఈకబురు,ఓస్లో: యూరప్ పర్యటనలో ఉన్న భారత ప్రధాని మోదీ నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్‌తో శుద్ధ ఇంధనంలో సమష్టి కృషే ధ్యేయంగా హరిత వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నారు. శుద్ధ ఇంధనం మొదలు వాతావరణ మార్పులను తట్టుకోవడం, తక్కువ కర్బన ఉద్గారాలు వెదజల్లేలా సముద్రవాణిజ్యాన్ని ప్రోత్సహించడం, డిజిటల్ సాంకేతిక, అంతరిక్షం, ఆర్కిటిక్ ఖండంలో పరిశోధన దాకా పలు అంశాలపై నార్వే ప్రధానితో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. సోమవారం నార్వే రాజధాని నగరం ఓస్లోలో జోనాస్ గార్ స్టోర్‌తో విస్తృతస్థాయిలో చర్చల సందర్భంగా మోదీ మాట్లాడారు. ''ఇరుదేశాల మధ్య బంధాన్ని హరిత వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుకోవాలని నిర్ణయించుకున్నాం. పర్యావరణ అనుకూల సుస్థిరాభివృద్ధి ధ్యేయంగా శుద్ధ ఇంధనంతోపాటు వాతావరణ మార్పుల కట్టడి, పర్యావరణ పరిరక్షణ కోసం ఇకపై భారత్, నార్వే కలిసి నడుస్తాయి. గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ తర్వాత భారత దేశ ప్రతిభ, అందిపుచ్చుకునే తత్వం, వేగాన్ని నార్వే సాంకేతికత, పెట్టుబడులతో జోడించి రెండు దేశాల పరిశ్రమలు, సంస్థలు క్లీన్ ఎనర్జీ మొదలు బ్లూ ఎకానమీ, గ్రీన్ షిప్పింగ్ దాకా ఎన్నో రంగాల్లో అద్భుతాలు సృష్టించనున్నాయి. సత్సంబంధంలో భారత్, యూరప్ కొత్త స్వర్ణయుగంలోకి అడుగుపెడుతున్నాయి. వచ్చే 15 ఏళ్లలో భారత్‌లోకి 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులతోపాటు పది లక్షల ఉద్యోగాల కల్పనకు భారత్, యురోపియన్ స్వేచ్ఛా, వాణిజ్య ఒప్పందం బాటలుపరుస్తుంది. వచ్చే నాలుగేళ్లలో నార్వే, భారత్ ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఆర్కిటిక్‌లో భారత పరిశోధనా కేంద్రం 'హిమాద్రి'కి నార్వే ఎంతగానో సాయపడుతోంది. ఇస్రో, నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య అవగాహన ఒప్పందం కుదరడం సంతోషకరం. ఆహార, ఇంధన భద్రత మొదలు పలు రంగాల్లో ఇరుదేశాల మధ్య బంధం సమున్నత శిఖరాలకు చేరుకోబోతోంది. ఉక్రెయిన్‌కావొచ్చు పశ్చిమాసియా సంక్షోభంకావొచ్చు ఏదైనా సంఘర్షణను చర్చలు, సంప్రతింపులు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోగలం. శాంతిస్థాపనకు భారత్, నార్వే ఎల్లప్పుడూ కృషిచేస్తాయి''అని మోదీ వ్యాఖ్యానించారు.

మోదీకి నార్వే అత్యున్నత పురస్కారం

నార్వే అత్యున్నత పౌర పురస్కారం 'ది గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది రాయల్ నార్వేనియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను మోదీ అందుకున్నారు. భారత్-నార్వే సత్సంబంధాలను సమున్నత శిఖరాలకు చేర్చేందుకు మోదీ చేస్తున్న కృషి, ఆయన దార్శనిక నాయకత్వానికిగాను మోదీని ఈ పురస్కారంతో గౌరవిస్తున్నట్లు నార్వే ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మెడల్‌ను రాజప్రాసాదంలో నార్వే రాజు హరాల్డ్-5 స్వయంగా మోదీకి ప్రదానంచేశారు.

కేరళ సీఎంగా సతీశన్ ప్రమాణం

జూన్ 15 నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణంపై ప్రకటన

ఈ కబురు, తిరువనంతపురం : కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయానికి బాటలు వేసిన వి.డి.సతీశన్ సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేశ్ చెన్నితాల సహా 20 మందితో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. యూడీఎఫ్ కూటమిలో రెండో అతిపెద్ద భాగస్వామి అయిన ఐయూఎంఎల్‌తో పాటు సహచర పక్షాలన్నిటికీ మంత్రివర్గంలో స్థానం కల్పించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. సతీశన్, ఆయన మంత్రివర్గ సహచరులు తొలి క్యాబినెట్ సమావేశంలో పాల్గొన్నారు. వచ్చే నెల 15 నుంచి మహిళలందరికీ కేఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆశా కార్యకర్తలకు, అంగన్‌వాడీ వర్కర్లకు గౌరవ భృతి పెంపుదల, వయోవృద్ధుల కోసం ఒక ప్రత్యేకశాఖ ఏర్పాటు తదితర నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన ఐదు గ్యారెంటీల్లో రెండింటిని అమలులోకి తెస్తున్నట్లు సీఎం ప్రకటించారు. కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలో నిజమైన ప్రగతికి బాటలు వేసినట్టేనని రాహుల్‌గాంధీ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

వదంతులు నమ్మి మోసపోవద్దు..

ఈకబురు, ,హైదరాబాద్ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉందని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా కొరత లేదని తెలంగాణలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) స్పష్టం చేశాయి. సరఫరాను ప్రభుత్వ రంగ ఓఎంసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, రవాణా, సరఫరా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పత్రికా ప్రకటనలో ఓఎంసీల రాష్ట్ర కోఆర్డినేటర్ వెల్లడించారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని ఓఎంసీలు నమోదు చేశాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహావసర ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్స్ తగ్గుముఖం పట్టాయి. ఆందోళనతో వినియోగదారులు ముందస్తు బుకింగ్స్ చేయటం లేదు. తెలంగాణలో ఈ నెలలో నిన్నటి వరకు మొత్తం 20.06 లక్షల గృహావసర ఎల్పీజీ సిలిండర్లను డెలివరీ చేశామనీ, ఈ సీజన్‌కు ఇది సాధారణమని ఓఎంసీలు తెలిపాయి. ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎల్పీజీ సిలిండర్లు బుక్ చేసుకోవాలని ఎల్పీజీ వినియోగదారులను కంపెనీలు ప్రోత్సహించాయి. ఎల్పీజీ సిలిండర్ల విషయంలో అక్రమాలను అరికట్టేందుకు, అసలైన లబ్ధిదారులకు అందేలా చూసేందుకు ఓటీపీ ఆధారిత సిలిండర్ డెలివరీ విధానమైన డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) వ్యవస్థను అనుసరించాలని కోరుతున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం డీఏసీ విధానం 95 శాతానికి పైగా అమలవుతోంది. రాష్ట్రంలో డీఏసీ అమలు శాతాన్ని వంద శాతానికి చేర్చేందుకు ఓఎంసీలు, గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల సహకారాన్ని కోరుతున్నాయి. నకిలీ వార్తలు, వదంతులను నమ్మి మోసపోవద్దని.. విశ్వసనీయ సంస్థలు అందించే వార్తలను మాత్రమే విశ్వసించాలని సామాన్య ప్రజలకు ఓఎంసీలు మరోసారి విజ్ఞప్తి చేశాయి.

సిరిసిల్లలో ఉద్రిక్తత

పోలీసులు లాఠీచార్జ్

ఈ-కబురు, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. 'బండి సంజయ్ డౌన్ డౌన్'.. 'కేటీఆర్ డౌన్ డౌన్' అంటూ ఇరువర్గాల పార్టీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ క్రమంలో పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసినట్టు సమాచారం. రెండు పార్టీ నేతల నిరసనలతో ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. వివరాల మేరకు.. సిరిసిల్లలోని నేతన్న చౌరస్తా వద్ద బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణుల పోటాపోటీ ధర్నాకు దిగాయి. ఈ క్రమంలో పరస్పర నినాదాలతో చౌరస్తా దద్దరిల్లింది. అనంతరం, బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య చెలరేగిన ఘర్షణ కొట్టుకునే స్థాయికి చేరింది. 'బండి సంజయ్ డౌన్ డౌన్'.. 'కేటీఆర్ డౌన్ డౌన్' అంటూ ఇరువర్గాల భారీ నినాదాలు చేశాయి. దీంతో, రంగంలోకి దిగి ఇరు పార్టీల నాయకులను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసుల లాఠీచార్జ్ చేశారు. కాగా, ఉభయ పార్టీల నేతలు.. పోలీసులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. దీంతో, జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సిరిసిల్ల నేతన్న చౌరస్తా వద్ద పోలీసులు భారీగా మోహరించారు. రెండు పార్టీ నేతలను అటువైపు రాకుండా అడ్డుకుంటున్నారు.

పిల్లలకూ యూపీఐ

హైదరాబాద్: డిజిటల్ చెల్లింపుల సంస్థ పేటీఎం, టీనేజర్లు, పిల్లల కోసం ప్రత్యేకంగా పాకెట్ మనీ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. పిల్లలు తమకంటూ సొంత బ్యాంకు ఖాతా లేకుండానే, పేటీఎం యూపీఐ ద్వారా చెల్లింపులు జరిపేందుకు ఇది ఉపకరిస్తుంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) 'యూపీఐ సర్కిల్' ఆధారంగా తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులు తమ పిల్లలను ఇందులోకి ఆహ్వానించొచ్చు. ఈ ఫీచర్‌తో స్కూల్/కాలేజీ క్యాంటీన్లు, మెట్రో, క్యాబ్‌లు, మొబైల్ రీఛార్జీ, చిన్నపాటి కొనుగోళ్ల వంటి రోజువారీ అవసరాలకు పిల్లలు తమ సొంత ఫోన్ల ద్వారా చెల్లింపులు చేయగలరు. ఇందుకోసం ప్రతిసారీ తల్లిదండ్రుల ఫోన్ అడగాల్సిన పనిలేదు. ఓటీపీతో కూడా సంబంధం లేకుండా, సొంతంగా లావాదేవీ పూర్తి చేయొచ్చు. పేటీఎం యూపీఐ పిన్ ద్వారా పిల్లల ఖర్చుల పరిమితి మార్చొచ్చు. అవసరమైతే నిలిపివేయొచ్చు. ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.5,000 వరకే అనుమతి ఉంటుంది. పేటీఎం యాప్‌ను వాడుతున్న వారు, తమ ఫోన్‌లో పిల్లల మొబైల్ నంబరును లేదా వారి యూపీఐ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, అవసరమైన వివరాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. పిల్లలు తమ ఫోన్‌లో దాన్ని అంగీకరించగానే, సేవలు ప్రారంభమవుతాయి.

ఎక్సైజ్ తొలగిస్తే రూ.3 లక్షల కోట్ల నష్టం

దేశంలో పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను లీటరుకు రూ.3 పెంచడం వల్ల, ప్రభుత్వ ద్రవ్య పరిస్థితిపై ఎలాంటి ప్రత్యక్ష ప్రభావం ఉండబోదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రీసెర్చ్ తాజా నివేదిక 'ఎకోర్యాప్'లో స్పష్టం చేసింది. ముడి చమురు ధరకు అనుగుణంగా రిటెయిల్ ధరలు సవరించకపోవడం వల్ల, చమురు మార్కెటింగ్ కంపెనీలు 202627లో రూ.3.6 లక్షల కోట్ల మేర భారీ నష్టాలు మూటగట్టుకునేవి. తాజా ధరల పెంపుతో ఈ సంస్థలకు రూ.52,700 కోట్ల మేర ఉపశమనం లభిస్తుంది.

ద్రవ్యోల్బణం పెరుగుతుంది

ఇంధన ధరల పెంపు వల్ల మేజూన్ కాలానికి రిటెయిల్ ద్రవ్యోల్బణం(సీపీఐ)పై 1520 బేసిస్ పాయింట్ల మేర ప్రభావం పడొచ్చు. అందుకే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణ అంచనాను 4.7 శాతానికి సవరించింది.

రూపాయి పతనమైతే..

డాలర్‌తో పోలిస్తే, రూపాయి మారకపు విలువ మరింత పతనమైతే, పెట్రో రిటెయిల్ ధరల పెంపు ద్వారా వచ్చిన ప్రయోజనాలు కంపెనీలకు ఆవిరవుతాయని ఎస్‌బీఐ పేర్కొంది. 2026 27లో డాలర్ విలువ సగటున రూ.94 వద్ద ఉంటుందని అంచనా అని, దీనికి అదనంగా రూపాయి విలువ మరో రూ.2 మేర పతనమైనా, దిగుమతి బిల్లు భారం అమాంతం పెరుగుతుందని విశ్లేషించింది.

ఎక్సైజ్ సుంకం సున్నా చేస్తే..

ప్రస్తుతం పెట్రోల్‌పై 11.9%, డీజిల్‌పై 7.8% ఎక్సైజ్ డ్యూటీ ఉంది. ఎక్సైజ్ డ్యూటీని పూర్తిగా తొలగిస్తే.. ప్రభుత్వానికి ఆదాయం రూ.1.9 లక్షల కోట్లు తగ్గుతుందని అంచనా. లీటరుకు రూ.10 సుంకం తగ్గించడం వల్ల, ఖజానాపై రూ.1.1 లక్షల కోట్ల భారం పడుతోందని, సుంకాన్ని పూర్తిగా తొలగిస్తే, మొత్తం ప్రభుత్వ ఆదాయ నష్టం రూ.3 లక్షల కోట్లకు చేరుతుందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాలూ రూ.50,000 కోట్ల ఆదాయాన్ని కోల్పోతాయని నివేదిక తెలిపింది

దిగుమతులు తగ్గించేలా.. దేశీయ తయారీ పెరగాలి

దిల్లీ: దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు, దేశీయంగా విభిన్న వస్తువుల తయారీని పెంచాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ పారిశ్రామిక వేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు మనం దిగుమతి చేసుకుంటున్న వస్తువుల్లో.. వేటిని స్థానికంగా తయారు చేసుకోగలమో గుర్తించాలని పరిశ్రమ వర్గాలకు సూచించారు. ఆ వస్తువులను దిగుమతి చేసుకోవడం కంటే కూడా.. ఎగుమతులను

పెంచడం, భారత్‌లో తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. వాణిజ్య శాఖ ట్రేడ్ పోర్టల్ ద్వారా దిగుమతుల ధోరణులను అధ్యయనం చేయాలని వివరించారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా అనిశ్చితులు ఏర్పడినప్పటికీ 2025-26లో భారత ఎగుమతులు 5% పెరిగి 863.11 బిలియన్ డాలర్లుగా నమోదైన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. 'ఈ ఏడాది లక్ష కోట్ల డాలర్ల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది పెద్ద లక్ష్యమే. దీనిని సాధించేందుకు అందరూ కలిసి ప్రయత్నించాల'ని గోయల్ తెలిపారు. నాణ్యత, పోటీ సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవడం, కార్యకలాపాలను పెంచుకోవడంపై పరిశ్రమ దృష్టి సారించాలని ఆయన సూచించారు. వివిధ దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) కూడా భారత ఎగుమతులు పెరిగేందుకు దోహదం చేస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

లాభాలు సరే.. పన్ను పడుతుంది జాగ్రత్త

హైదరాబాద్: సార్వభౌమ పసిడి బాండ్ల (ఎస్‌జీబీ)లో పెట్టుబడి పెట్టిన వారికి ఊహించని స్థాయిలో కాసుల వర్షం కురుస్తోంది. అయిదున్నర ఏళ్ల క్రితం పెట్టిన పెట్టుబడి ఇప్పుడు 212 శాతానికి పైగా లాభాలను తెచ్చిపెడుతోంది. 2020 నవంబరు 18న జారీ చేసిన ఎస్‌జీబీ సిరీస్8 బాండ్లకు సోమవారం (2026 మే 18) నుంచి ముందస్తు రిడెంప్షన్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అవకాశం కల్పించింది. అప్పట్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి గ్రాముకు రూ.5,127 చొప్పున, ఆఫ్‌లైన్ ద్వారా కొనుగోలు చేసిన వారికి రూ.5,177 చొప్పున ఈ బాండ్లను జారీ చేశారు. ప్రస్తుతం ఈ బాండ్ల ముందస్తు ఉపసంహరణ ధరను యూనిట్‌కు రూ.16,012గా ఆర్‌బీఐ ఖరారు చేసింది. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ఈనెల 13, 14, 15 తేదీల్లో ప్రకటించిన 999 స్వచ్ఛత గల బంగారం సగటు ముగింపు ధర ఆధారంగా ఈ రేటు లెక్కించారు. దీనిప్రకారం.. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన పెట్టుబడిదారులకు అసలు పెట్టుబడిపై 213.20% (గ్రాముకు రూ.10,885) లాభం వస్తోంది. అంటే, ఈ సిరీస్‌లో రూ.లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు రూ.3.12 లక్షలు చేతికి వస్తాయి. ఈ అయిదున్నర ఏళ్లలో, పెట్టుబడిదారులకు ఆరు నెలలకోసారి అసలుపై 2.5% చొప్పున వడ్డీ కూడా లభించింది.

కొత్త బాండ్లు లేవు

2020 నవంబరులో రూ.4,480 5,177 మధ్య ఉన్న గ్రాము మేలిమి బంగారం ధర, ఇప్పుడు రూ.16,000 మించడమే ఈ రికార్డు స్థాయి లాభాలకు ప్రధాన కారణం. బంగారం ధర విపరీతంగా పెరుగుతున్నందున, ప్రభుత్వం 2025 బడ్జెట్ నుంచే కొత్తగా సావరిన్ గోల్డ్ బాండ్ల జారీని నిలిపివేసింది. కొత్తగా బాండ్లు కొనాలనుకునే వారు, స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా సెకండరీ మార్కెట్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది.

పన్ను నిబంధనలు ఇలా

బంగారం బాండ్లపై లాభాలు ఆకర్షణీయంగా ఉన్నా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1) నుంచి అమల్లోకి వచ్చిన కొత్త పన్ను నిబంధనలను పెట్టుబడిదారులు కచ్చితంగా గమనించాలి. ముఖ్యంగా సెకండరీ మార్కెట్ ద్వారా కొనుగోలు చేసేవారు ఈ నిబంధనలు తప్పక తెలుసుకోవాలి.

ఆర్‌బీఐ అనుమతి ఇచ్చినప్పుడు 'ఎర్లీ విండో' అందుబాటులోకి వస్తుంది. అయితో సంవత్సరం నుంచి ఎనిమిదో సంవత్సరం వరకూ ఇది అందుబాటులో ఉంటుంది. కాకపోతే, ఏడాదంతా కాకుండా, బాండ్‌పై వడ్డీ చెల్లించే తేదీల్లో మాత్రమే దీన్ని అనుమతిస్తారు. ప్రతి 6 నెలలకోసారి ఈ వడ్డీ తేదీలు వస్తాయి. అప్పుడే మూలధన రాబడులపై పన్ను ఉండదు. దీన్ని వాడుకోవాలనుకుంటే, వడ్డీ చెల్లింపు తేదీకి 10 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి.

సెకండరీ మార్కెట్లో విక్రయిస్తే.. నిబంధనల మేరకు పన్ను వర్తిస్తుంది.

కొత్త నిబంధనల ప్రకారం బాండ్లను ఎనిమిదేళ్ల పూర్తి కాలపరిమితి వరకు అట్టేపెట్టుకునే అసలు కొనుగోలుదారులు (ప్రభుత్వం నుంచి నేరుగా కొన్నవారికి) మాత్రమే, గడువు తీరాక వచ్చే మూలధన లాభాలపై పన్ను మినహాయింపు వర్తిస్తుంది.

స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా సెకండరీ మార్కెట్‌లో ఈ బాండ్లను కొనుగోలు చేసిన వారికి ఇకపై పన్ను మినహాయింపు ప్రయోజనం ఉండదు. వీరు బాండ్లను కొనుగోలు చేసి 12 నెలల కంటే ఎక్కువ కాలం అట్టేపెట్టుకుంటే, ఎలాంటి సర్దుబాటు (ఇండెక్సేషన్) ప్రయోజనం లేకుండా 12.5% దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) చెల్లించాల్సిందే. 12 నెలల లోపు విక్రయిస్తే, వారి ఆదాయపు పన్ను శ్లాబు రేట్ల ప్రకారం స్వల్పకాలిక పన్ను (ఎస్‌టీసీజీ) వర్తిస్తుంది.

ఈజీఆర్‌ల ట్రేడింగ్ ప్రారంభం: ఎన్ఎస్ఈ స్పాట్ గోల్డ్ మార్కెట్‌పై నియంత్రణ కోసం, ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ (ఈజీఆర్) ట్రేడింగ్‌ను సోమవారం ప్రారంభించినట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) తెలిపింది. ఇందుకోసం మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదించిన బ్యాంకులతో పాటు బులియన్ వ్యాపారులు బంగారాన్ని అత్యంత సురక్షిత వాల్ట్‌లలో డిపాజిట్ చేసి, ఈజీఆర్‌లు జారీ చేస్తారు. షేర్ల తరహాలోనే వీటిని కొన్నవారికి, యాజమాన్య హక్కులు లభిస్తాయి. దేశం మొత్తం ఒకే ధర ఉంటుంది. రిసీట్‌లను బంగారంగా మార్చుకోవాలనుకున్నప్పుడే జీఎస్‌టీ, ఇతర నామమాత్ర ఖర్చులు చెల్లించాలి. ప్రస్తుతం వాల్ట్‌లు అహ్మదాబాద్, ముంబయి, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, బెంగళూరుల్లో ఉన్నాయి. ఈజీఆర్ కొనుగోలు చేసిన వారు, కావాలంటే ఇక్కడ నుంచి బంగారం రూపంలో తీసుకెళ్లొచ్చు. దశలవారీగా ఈ కేంద్రాల సంఖ్యను 120కి విస్తరిస్తారు.

రష్యా చమురు కొనుగోళ్లు కొనసాగుతున్నాయ్

అమెరికా ఆంక్షల మినహాయింపులతో సంబంధం లేకుండా, రష్యా నుంచి ముడిచమురును మన దేశం నిరంతరం కొనుగోలు చేస్తోందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ స్పష్టం చేశారు. దేశ అవసరాలకు తగిన ముడిచమురు అందుబాటులో ఉంచడం, వాణిజ్య పరమైన ప్రయోజనాలే మనకు ముఖ్యమని వివరించారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో, రష్యా ముడిచమురుపై గతంలో విధించిన ఆంక్షల నుంచి ఈనెల 16 వరకు మినహాయింపులను అమెరికా ఇచ్చింది. వీటితో సంబంధం లేకుండా, రష్యా నుంచి చమురు సరఫరాలు మనకు యథాతథంగా అందుబాటులో ఉన్నాయని దేశీయ రిఫైనర్లు, ట్రేడర్లు చెబుతున్నారు. అమెరికా మినహాయింపుల నియమావళిపై మనదేశం ఆధారపడలేదని, వాణిజ్యపరమైన అంశాల ఆధారంగానే ముందుకెళ్తున్నామని వివరించారు. దేశంలో ముడిచమురు కొరత లేదని, ముందస్తు ఒప్పందాల ద్వారా తగినంత సరఫరా సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. మార్చి నుంచి మినహాయింపులు: ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించాక, అంతర్జాతీయంగా ముడిచమురు ధర పెరగడంతో.. అదనపు సరఫరాలకు వీలు కల్పించేందుకు రష్యా చమురుపై మార్చిలో అమెరికా మినహాయింపులు ఇచ్చింది. ఆ తర్వాత దాన్ని మే 16 వరకు పొడిగించింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించుకోవాలని అమెరికా కోరినా, మనదేశం ఆపలేదు. అయితే అమెరికా, యూఏఈ, ఒమన్, ఇరాక్ నుంచి కూడా చమురు అందుబాటులో ఉండటం వల్ల భారత రిఫైనరీలకు ఇబ్బంది ఉండదని బ్లూమ్‌బర్గ్ నివేదిక అంచనా వేస్తోంది. స్పాట్ మార్కెట్‌లో చైనా పరిమితంగా పాల్గొనడమూ మనకు కలిసివస్తోంది. అయితే రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ రిఫైనరీల్లో నిర్వహణ షట్‌డౌన్‌ల కారణంగా కొంత కొనుగోళ్లు తగ్గాయని ట్రేడర్లు వెల్లడించారు.

ప్రస్తుతం రష్యా చమురు దిగుమతులు ఇలా: మార్కెట్ పరిశోధనా సంస్థ కెప్లెర్ గణాంకాల ప్రకారం.. మే నెలలో రష్యా నుంచి మన దేశానికి రోజూ దాదాపు 1.9 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతి కావచ్చు. అంతర్జాతీయంగా ఫ్లోటింగ్ స్టోరేజ్ (సముద్రంగా నిల్వ)లో ఉన్న రష్యా ముడిచమురు గత నెలతో పోలిస్తే 5 రెట్లు పెరిగి 7 మిలియన్ బ్యారెళ్లకు చేరిందని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. సమీప భవిష్యత్తులోనూ రష్యా చమురు కొనుగోళ్లను భారత్ నిలిపే అవకాశం లేదని కెప్లెర్ రిఫైనింగ్ మేనేజర్ సుమిత్ రిటోలియా అభిప్రాయపడ్డారు. రష్యా చమురుకు మినహాయింపులను అమెరికా మళ్లీ 30 రోజుల పాటు పొడిగిస్తున్నట్లు సోమవారం ప్రకటించింది.

భారీ నష్టాల నుంచి కోలుకుని..

ఆరంభ భారీ నష్టాల నుంచి బలంగా పుంజుకున్న దేశీయ సూచీలు, చివరకు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఐటీ, కొన్ని బ్లూచిప్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చింది. బలహీన రూపాయి, ముడిచమురు ధరలు మదుపర్లను కలవరపెట్టాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 39 పైసలు తగ్గి రికార్డు కనిష్ఠమైన 96.20 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు ధర 2.5% పెరిగి 111 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా, ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి.

బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.22 లక్షల కోట్లు తగ్గి, రూ.458.37 లక్షల కోట్ల (4.76 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

సెన్సెక్స్ ఉదయం 430 పాయింట్ల (క్రితం ముగింపు 75,237.99) నష్టంతో 74,807.97 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో 1134.78 పాయింట్లు నష్టపోయి 74,180.26 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి చేరింది. అనంతరం బలంగా పుంజుకున్న సూచీ, లాభాల్లోకి వచ్చి 75,466.60 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 77.05 పాయింట్ల లాభంతో 75,315.04 వద్ద ముగిసింది. కనిష్ఠాల నుంచి దాదాపుల 1200 పాయింట్ల మేర సెన్సెక్స్ రికవరీ అయ్యింది. నిఫ్టీ 6.45 పాయింట్లు పెరిగి 23,649.95 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,317.10- 23,695.65 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 18 లాభపడ్డాయి. టెక్ మహీంద్రా 4.39%, ఇన్ఫోసిస్ 2.15%, భారతీ ఎయిర్‌టెల్ 1.76%, బజాజ్‌ఫిన్‌సర్వ్ 1.52%, సన్‌ఫార్మా 1.34%, హెచ్‌సీఎల్ టెక్ 1.24%, బజాజ్ ఫైనాన్స్ 1.15%, కోటక్ బ్యాంక్ 1.14%, టీసీఎస్ 0.90% రాణించాయి. టాటా స్టీల్ 3.21%, పవర్‌గ్రిడ్ 3.07%, ఎస్‌బీఐ 2.38%, ఎన్‌టీపీసీ 1.86%, ట్రెంట్ 1.68%, మారుతీ 1.60% డీలాపడ్డాయి. బీఎస్ఈలో 1199 షేర్లు లాభపడగా, 3117 స్క్రిప్‌లు నష్టపోయాయి. 187 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా గున్‌వీర్ సింగ్‌కు పదోన్నతి కల్పించారు. ఇప్పటివరకు ఆయన ఆర్‌బీఐలో పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ విభాగ చీఫ్ జనరల్ మేనేజరుగా ఉన్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని ఇటావా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే నాగర్ సహకారి బ్యాంకుపై 6 నెలల పాటు కఠిన నిబంధనలను ఆర్‌బీఐ విధించింది. ఖాతాదారులు గరిష్ఠంగా రూ.10,000 వరకే ఉపసంహరించుకునే వీలు కల్పించింది.

పుణెలోని తమ తయారీ ప్లాంటుపై మరో రూ100 కోట్ల పెట్టుబడి పెడతామని అమెరికాకు చెందిన విమాన ఇంజిన్ల సంస్థ జీఈ ఏరోస్పేస్ వెల్లడించింది. మూడేళ్లలో కలిపి సంస్థ పెట్టుబడుల విలువ రూ.510 కోట్లకు చేరింది.

ఎన్ఎస్ఈలో బల్క్‌డీల్ ద్వారా 2.5 కోట్ల జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లను జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ రూ.3,150 కోట్లకు విక్రయించింది.

జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో 4.9% వాటాను రూ.193.32 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు టీవీఎస్ మోటార్ కంపెనీ ప్రకటించింది. టీవీఎస్ వేణు ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ కొనుగోలును కంపెనీ పూర్తిచేయనుంది.

ఎన్టీఆర్, చరణ్, అల్లు అర్జున్..

శ్రీదేవి కూతురా.. మజాకానా

అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలిగా జాన్వీ కపూర్ (Janhvi Kapoor) ఇండస్ట్రీకి పరిచయమైంది. బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఎదగాలని ప్రయత్నించింది. విజయాపజయాలను లెక్కచేయకుండా వరుస సినిమాలు చేస్తూ వచ్చింది. కానీ, ఆశించినంత గుర్తింపును అందుకోలేదు. దీంతో అమ్మడి చూపు టాలీవుడ్ మీద పడింది. దేవర సినిమాతో జాన్వీ టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చింది. అంతకుముందు ఎంత మంచి ఆఫర్ వచ్చినా.. ఎన్టీఆర్ తోనే నటించాలని బలంగా కోరుకొని.. దేవరతో ఆ కోరికను నెరవేర్చుకొంది. ఇక బాలీవుడ్ లో చేసిన తప్ప చేయకుండా టాలీవుడ్ కెరీర్ ని మాత్రం చాలా పకడ్బందీగా ప్లాన్ చేస్తోంది జాన్వీ. దేవర రిలీజ్ అవ్వకముందే పెద్దిలో రామ్ చరణ్ సరసన నటించే అవకాశం అందిపుచ్చుకుంది. ఇక ఈ సినిమా జాన్వీ కెరీర్ ని మలుపు తిప్పబోతోందని అంటున్నారు. చిన్న క్యారెక్టర్ అయినా కూడా అమ్మడి అందానికి ఫిదా అవ్వడం ఖాయమని టాక్. జూన్ 4 న పెద్ది సినిమా రిలీజ్ కానుంది. ఈ సినిమా రిలీజ్ కాకముందే ఈ చిన్నది మరో లక్కీ ఛాన్స్ పట్టేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. పుష్ప 2 తరువాత అల్లు అర్జున్ నటిస్తోన్న చిత్రం రాకా. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమాలో దీపికా పదుకొనే, మృణాల్ ఠాగూర్, రష్మిక మందన్నా హీరోయిన్స్ గా నటిస్తున్నారు. అందుతున్న సమాచారం ప్రకారం జాన్వీ కూడా రాకాలో ఒక హీరోయిన్ గా నటిస్తోందని తెలుస్తోంది. వచ్చే నెలలో జాన్వీ రాకా సెట్ లో అడుగుపెడుతోందంట. ఈ విషయాన్నీ మేకర్స్ చాలా జాగ్రత్తగా దాచినట్లు సమాచారం. ఇదే కనుక నిజమైతే జాన్వీ చాలా గట్టిగా కెరీర్ ని ప్లాన్ చేస్తోందని చెప్పొచ్చు. వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ పట్టేసి స్టార్ హీరోయిన్ గా పాగా వేయడానికి చూస్తోంది. మరి తల్లిలా కూతురు కూడా టాలీవుడ్ టాప్ హీరోయిన్ గా నిలుస్తుందా లేదా చూడాలి.

సినిమాలు.. డేటింగ్ యాప్‌లో లవ్

.. నటి మృతి కేసులో సంచలన విషయాలు

మాజీ మిస్ పుణె, ఎంబీఏ గ్రాడ్యుయేట్ ట్విషా శర్మ (Twisha Sharma) మృతి కేసు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. గత వారం అత్తవారింట్లో అనుమానాస్పద రీతిలో శవమై కనిపించగా.. ఆమె మరణానికి సంబంధించి పలు కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.ట్విషా శర్మది ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడా. 2012లో మిస్ పుణెగా నిలిచిన ఆమె.. కొంతకాలం ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. తెలుగులో 2021లో వచ్చిన 'ముగ్గురు మొనగాళ్లు' చిత్రంలో నటించారు. పలు బ్రాండ్లకు ప్రచారకర్తగానూ కనిపించారు. ఎంబీఏ చదివిన ఆమె.. పెళ్లికి ముందు ఓ మార్కెటింగ్ కంపెనీలో పనిచేశారు. ఒక డేటింగ్ యాప్‌లో పరిచయమైన లాయర్ సమర్థ్ సింగ్‌ను ప్రేమించి.. 2025, డిసెంబర్‌లో వివాహం చేసుకున్నారు. అతడిది మధ్యప్రదేశ్‌లోని భోపాల్. వివాహం జరిగిన ఐదు నెలల తర్వాత ఈ నెల 12న ట్విషా శర్మ అత్తవారింట్లో ఉరివేసుకొని మృతి చెందినట్లుగా వార్తలు వచ్చాయి.

'అమ్మా.. నన్ను బతకనివ్వరు.. తీసుకెళ్లిపోండి'

మృతి చెందడానికి ముందు తన తల్లి, స్నేహితురాలికి ట్విషా పలు సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. తాను వేధింపులు, మానసిక క్షోభ అనుభవిస్తున్నానని, తన జీవితం నరకంలా మారిందని ఏప్రిల్ 30న తన తల్లికి సందేశం పంపింది. 'వాళ్లు నన్ను బతకనివ్వరు. ఇక్కడి నుంచి నన్ను తీసుకెళ్లండి. ఏదీ సరిగా జరగడం లేదు' అని మళ్లీ మే 7న మరో మెసేజ్ పంపడం గమనార్హం. తాను ఈ వివాహ బంధంలో చిక్కుకుపోయానని, సంతోషంగా లేనంటూ ఆవేదన చెందుతూ తన స్నేహితులకు పంపిన మెసేజ్‌ల్లోనూ రాసింది. దీంతో ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ట్విషా శర్మ (Twisha Sharma) భర్త లాయర్ కాగా.. అత్త గిరిబాలా సింగ్ విశ్రాంత న్యాయమూర్తి. ప్రస్తుతం భోపాల్‌లోని కటారా హిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (SIT) ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అధికారులు ఈ చాట్‌లు, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నారు. వరకట్న వేధింపుల కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. తమ కుమార్తె మరణానికి ఆమె భర్త, అత్తే కారణమని ట్విషా కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వారికున్న పరిచయాలతో కేసు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో వారికి ఇప్పటికే ముందస్తు బెయిల్ లభించిందని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం భర్త సమర్థ్ పరారీలో ఉండగా.. అతడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. అతడి ఆచూకీ చెబితే రూ.10వేలు ఇస్తామని భోపాల్ పోలీసులు రివార్డు సైతం ప్రకటించారు.

'కరుప్పు' క్లైమాక్స్.. థియేటర్స్ లో పూనకాల వీడియోలు తీయొద్దు: సూర్య

థియేటర్స్ లో 'కరుప్పు' క్లైమాక్స్ చూసి పూనకాలతో ఊగిపోతున్న ప్రేక్షకులకు తగిన ప్రథమ చికిత్స అందించాలని కోరారు నటుడు సూర్య (Suriya). ఆయన కథానాయకుడిగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'కరుప్పు' (Karuppu). తెలుగులో 'వీరభద్రుడు' (veerabhadrudu) పేరుతో విడుదలైంది. త్రిష కథానాయిక. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ సూర్య అభిమానులను అలరిస్తోంది. ముఖ్యంగా క్లైమాక్స్‌లో సూర్య నటనకు అందరూ ఫిదా అవుతున్నారు. ఈ క్రమంలో తన దృష్టికి వచ్చిన విషయంపై సూర్య 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టారు.''ఎన్నో అడ్డంకులను అధిగమించి 'కరుప్పు' విజయవంతంగా ప్రదర్శితమవడం సంతోషంగా ఉంది. సినిమా విడుదలకు ముందు థియేటర్స్ యజమానులు, సిబ్బంది, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్, డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అవన్నీ తొలగిపోయాయి. నా ప్రియమైన అభిమానులందరికీ ధన్యవాదాలు. ఈ సందర్భంగా మరో విన్నపం కూడా చేస్తున్నా: 'కరుప్పు స్వామి'ని చూసి థియేటర్‌స్‌లో పరవశించిపోతున్న ప్రేక్షకులను దయచేసి వీడియోలు తీయకండి. వారికి ముందుగా తగిన ప్రథమ చికిత్స అందించాలని కోరుతున్నా'' అని అన్నారు.

ఫస్ట్ వీకెండ్‌లో రూ. 147 కోట్లు....

మరోవైపు, తమిళంతో పాటు, తెలుగులోనూ 'వీరభద్రుడు'గా సూర్య మూవీ వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ఫస్ట్ వీకెండ్‌లో ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.147 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ పేర్కొంది. సూర్య గత చిత్రాలతో పోలిస్తే, అభిమానులను అలరించే అంశాలు ఎక్కువగా ఉండటం 'కరుప్పు' మూవీకి కలిసొచ్చింది. ఎంట్రీ సీన్, విరామ సన్నివేశాలతో పాటు, క్లైమాక్స్‌లో వీరభద్రుడిగా సూర్య తాండవం అభిమానులతో విజిల్స్ వేయిస్తోంది. అదే సమయంలో ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర చిత్రాలు లేకపోవడం కూడా ఈ మూవీకి కలిసొచ్చిందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

థియేటర్లు దద్దరిల్లడం ఖాయం..

'పెద్ది' ట్రైలర్ వచ్చేసింది

'మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు. నేను పోరాడాను సారు..' అంటున్నాడు రామ్‌చరణ్ (Ram Charan). ఆయన కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' (Peddi). జాన్వీకపూర్ (Janhvi Kapoor) కథానాయిక. వెంకట సతీశ్ కిలారు, ఇషాన్ సక్సేనా నిర్మాతలు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 4న (peddi release date) పాన్ ఇండియా స్థాయిలో తెలుగు సహా ఇతర భాషల్లోనూ విడుదల కానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ముంబయిలో ట్రైలర్ విడుదల చేశారు. రామ్‌చరణ్ నటన, బుచ్చిబాబు టేకింగ్ చూస్తుంటే, థియేటర్లు దద్దరిల్లడం ఖాయమనిపిస్తోంది.

'పెద్ది' సినిమాను అద్దె విధానంలో ప్రదర్శించలేం: ఎగ్జిబిటర్లు

హైదరాబాద్: తెలుగు సినీ పరిశ్రమలో పర్సంటేజీ వివాదం మళ్లీ మొదటికొచ్చింది. ఫిల్మ్ ఛాంబర్‌లో 21 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ రెండోసారి భేటీ అయింది. ఈ సమావేశంలో అద్దె, పర్సంటేజీ విధానంపై సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. 'పెద్ది' చిత్రాన్ని అద్దె విధానంలో ప్రదర్శించలేమని పలువురు ఎగ్జిబిటర్లు తెలిపారు. వారి నిర్ణయంపై కొందరు నిర్మాతలు మండిపడ్డారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో 'పెద్ది' చిత్ర ప్రదర్శనపై మంగళవారం స్పష్టత వచ్చే అవకాశముంది.

పురుషుల కోణం నుంచి..

''కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా 'పురుషః'. ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుంది'' అంటున్నారు దర్శకుడు వీరు ఉలవల. ఆయన దర్శకత్వంలో పవన్ కల్యాణ్, సప్తగిరి, రాజ్‌కుమార్ కసిరెడ్డి ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. 'ఇప్పటివరకు భార్యాభర్తల పైనా.. భార్యల పైనా చాలా కథలొచ్చాయి. అందుకే నేను మగవాళ్ల కోణం నుంచి కథ చెప్పాలన్న ఉద్దేశంతో ఈ స్క్రిప్ట్ తీర్చిదిద్దాం. ఇందులో ఓ సర్‌ప్రైజ్ మూమెంట్ ఉంది. అది ఏంటన్నది సినిమా చూసి తెలుసుకోవాలి' అని చిత్ర బృందం చెబుతోంది. మే 22న (Purushah Movie release date) ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

సరికొత్త ప్రయోగం: 'అగ్లీ స్టోరీ'

నందు (Nandu), అవికా గోర్ (Avikagor), రవితేజ మహాదాస్యం ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అగ్లీ స్టోరీ' (Ugly Story). ప్రణవ స్వరూప్ దర్శకుడు. రొమాంటిక్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ మూవీ మే 22న ప్రేక్షకుల ముందుకురానుంది. చిన్నప్పటి నుంచీ ఓ అమ్మాయిని ప్రాణంగా ప్రేమించిన హీరో.. ఆమె వేరొకరిని ఇష్టపడుతోందని తెలుసుకుని ఎలాంటి సైకోయిజానికి పాల్పడ్డాడు అనేది ఈ సినిమా ప్రధానాంశం.

భారీ విజువల్ ఎఫెక్ట్స్ తో..

సౌరభ్ ధింగ్రా కథానాయకుడిగా హేమంత్ ఇప్పపల్లి దర్శకనిర్మాణంలో రూపొందిన సరికొత్త చిత్రం 'ఫస్ట్ టైమ్ 010101'. అనిక విక్రమన్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ మే 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. విజువల్ ఎఫెక్ట్స్ ప్రధానంగా భారీ హంగులతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

ధోని వీడ్కోలు.. ఒక శకం ముగిసింది!

ఎంఎస్ ధోని.. ఈ పేరు సీఎస్‌కే ఫ్రాంచైజీలో చిరస్థాయిగా మిగిలిపోనుంది. సీఎస్‌కేకు ఐదుసార్లు టైటిల్ అందించిన కెప్టెన్‌గా అరుదైన రికార్డు సొంతం చేసుకున్న ధోని ఈ సీజన్‌లో సొంత ఇలాఖాలో ఒక్క మ్యాచ్ ఆడకుండానే అభిమానులకు వీడ్కోలు పలికాడు.

ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి సీఎస్‌కేకు ప్రాతినిధ్యం వహించిన ధోని (మధ్యలో సీఎస్‌కేపై నిషేధంతో రెండు సీజన్లు మినహాయింపు) సోమవారం సొంతగడ్డపై చివరి మ్యాచ్ ఆడేశాడు. అదేంటి ధోని తుది జట్టులో లేడు కదా అన్న అనుమానం మీకు కలగొచ్చు. అయితే సీఎస్‌కేకు చెపాక్ స్టేడియంలో ఎస్ఆర్‌హెచ్‌తో మ్యాచ్ చివరిది. ఆ తర్వాత మే 21న అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో ఆడనుంది.ఎంఎస్ ధోని.. ఈ పేరు సీఎస్‌కే ఫ్రాంచైజీలో చిరస్థాయిగా మిగిలిపోనుంది. సీఎస్‌కేకు ఐదుసార్లు టైటిల్ అందించిన కెప్టెన్‌గా అరుదైన రికార్డు సొంతం చేసుకున్న ధోని ఈ సీజన్‌లో సొంత ఇలాఖాలో ఒక్క మ్యాచ్ ఆడకుండానే అభిమానులకు వీడ్కోలు పలికాడు. ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి సీఎస్‌కేకు ప్రాతినిధ్యం వహించిన ధోని (మధ్యలో సీఎస్‌కేపై నిషేధంతో రెండు సీజన్లు మినహాయింపు) సోమవారం సొంతగడ్డపై చివరి మ్యాచ్ ఆడేశాడు. అదేంటి ధోని తుది జట్టులో లేడు కదా అన్న అనుమానం మీకు కలగొచ్చు. అయితే సీఎస్‌కేకు చెపాక్ స్టేడియంలో ఎస్ఆర్‌హెచ్‌తో మ్యాచ్ చివరిది. ఆ తర్వాత మే 21న అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో ఆడనుంది.ఆ తర్వాత ఆటగాళ్లతో కాసేపు సంభాషించాడు. అనంతరం అభిమానుల వైపు ఒక లుక్ ఇచ్చిన ధోని చేతులూపుతూ డ్రెస్సింగ్ రూమ్ వైపు భారంగా అడుగులు వేయడం కనిపించింది. ధోని పెవిలియన్ వెళుతున్న క్రమంలో సీఎస్‌కే ఆటగాళ్లు గార్డ్ ఆఫ్ ఆనర్ ఇచ్చారు. ఈ సమయంలో చెపాక్ స్టేడియంలో కాసేపు నిశబ్దం అలుముకుంది. అభిమాన ఆటగాడైన ధోని సీఎస్‌కే సొంత స్టేడియంలో తన చివరి మ్యాచ్ ఆడకుండానే ఇలా సైలెంట్‌గా వీడ్కోలు పలకడాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఓవరాల్‌గా ధోని ఐపీఎ ల్‌లో 278 మ్యాచ్‌లాడి 5,439 పరుగులు చేశాడు. ఇందులో 24 అర్ధసెంచరీలు ఉన్నాయి.

సీఎస్‌కేపై గెలుపు.. ప్లేఆఫ్స్ కు దూసుకెళ్లిన సన్‌రైజర్స్

చెన్నై: ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 70) అద్భుత ఆటతీరుతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టింది. అటు తమ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తేలిపోయింది. చెపాక్‌లో చివరి మ్యాచ్ ఆడిన చెన్నై చివరి వరకు పోరాడినా 5 వికెట్ల తేడాతో ఓడింది. అయితే చెన్నైన 12 పాయింట్లతో ఇప్పటికీ అధికారికంగా రేసులోనే ఉన్నా తమ ఆఖరి మ్యాచ్‌లో గుజరాత్‌పై గెలిచి.. పోటీగా ఉన్న పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీ ఓడాల్సి ఉంటుంది. మరోవైపు ఈ ఫలితంతో.. రైజర్స్‌తో పాటు 16 పాయింట్లతో ఉన్న గుజరాత్ కూడా ప్లేఆఫ్స్‌లో ప్రవేశించడం విశేషం. మరే జట్టుకు ఇన్ని పాయింట్లు వచ్చే చాన్స్ లేకపోవడమే ఇందుకు కారణం. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా చెన్నై 20 ఓవర్లలో 7 వికెట్లకు 180 పరుగులు చేసింది. బ్రెవిస్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 44), కార్తీక్ శర్మ (19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32), సంజూ శాంసన్ (13 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 27) రాణించారు. కమిన్స్‌కు 3, సకీబ్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో సన్‌రైజర్స్ 19 ఓవర్లలో 181/5 స్కోరు చేసి గెలిచింది. క్లాసెన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 47) కీలకంగా నిలిచాడు. ముకేశ్‌కు 2 వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఇషాన్ నిలిచాడు.

ఆదుకున్న ఇషాన్: కఠిన పిచ్‌పై ఛేదనకు బరిలోకి దిగిన సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ నిదానంగానే ఆరంభించింది. మధ్య ఓవర్లలో అండగా నిలిచిన ఇషాన్ దాదాపు చివరి వరకు నిలిచి చెన్నైకి చెక్ పెట్టాడు. అతడికి క్లాసెన్ సహకరించాడు. ఓపెనర్ హెడ్ (6) మూడో ఓవర్‌లో వెనుదిరగ్గా.. స్పిన్నర్లు అకీల్, నూర్ కట్టడి చేయడంతో అభిషేక్ (21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్‌తో 26) కూడా భారీ షాట్లు ఆడలేకపోయాడు. దీంతో పవర్‌ప్లేలో ఎస్ఆర్‌హెచ్ 45 రన్స్‌కే పరిమితమైంది. ఆ తర్వాత 8వ ఓవర్‌లో అభిషేక్‌ను అకీల్ అవుట్ చేయడంతో చెన్నైకి పట్టు చిక్కినట్టయ్యింది. అటు క్రీజులో ఉన్న ఇషాన్‌క్లాసెన్ కూడా వికెట్ పడకుండా ఆచితూచి ఆడాల్సి వచ్చింది. దీంతో తొలి 10 ఓవర్లలో రైజర్స్ 75 రన్సే చేసింది. కానీ, ఆ తర్వాత క్లాసెన్ చెలరేగాడు. దీనికితోడు 11వ ఓవర్‌లో అతడి క్యాచ్‌ను జాన్సన్ వదిలేయడం చెన్నైని దెబ్బతీసింది. అదే ఓవర్‌లో క్లాసెన్ 6,4 బాదాడు. ఇషాన్ కూడా బౌండరీలు రాబట్టడంతో మ్యాచ్ రైజర్స్ వైపు మొగ్గు చూపింది. 15వ ఓవర్‌లో శాంసన్ మెరుపు స్టంపింగ్‌తో క్లాసెన్ వెనుదిరగడంతో మూడో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే నితీశ్ (11) అవుటైనా.. రన్‌రేట్ అదుపులోనే ఉండడంతో రైజర్స్‌కు ఇబ్బంది ఎదురుకాలేదు. ఇక 12 బంతుల్లో 13 రన్స్ కావాల్సిన వేళ.. 19వ ఓవర్‌లో ఇషాన్ అవుటైనా సలీల్ (10 నాటౌట్) సిక్సర్, స్మరణ్ (5 నాటౌట్) ఫోర్‌తో మ్యాచ్ ముగిసింది.

మెరుపుల్లేవ్..: టాస్ గెలిచిన చెన్నై ప్రత్యర్థి ముందు భారీ స్కోరును ఉంచాలనే ఆలోచనతో బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ పిచ్ నుంచి వీరికేమాత్రం సహకారం లభించలేదు. అయితే ఓపెనర్ శాంసన్, కార్తీక్, ఉర్విల్ (13), బ్రెవిస్ వేగం చూపడంతో కాస్త సవాల్ విసిరే స్కోరందుకుంది. ఇక ఓపెనర్ రుతురాజ్ (15) 12 ఓవర్లపాటు బ్యాటింగ్ సాగించినా షాట్లు ఆడేందుకు బాగా ఇబ్బందిపడ్డాడు. అయితే ఆరంభంలో శాంసన్ ధనాధన్ ఆటతో తొలి ఓవర్‌లోనే 6,4,4తో 17 రన్స్ రాబట్టాడు. అలాగే రెండో ఓవర్‌లోనూ హ్యాట్రిక్ ఫోర్లు బాదడంతో చెపాక్‌లో జోష్ కనిపించింది. కానీ తర్వాతి ఓవర్‌లోనే పేసర్ కమిన్స్ అతడిని దెబ్బతీశాడు. అయితే ఉర్విల్ వచ్చీ రాగానే రెండు వరుస సిక్సర్లతో మురిపించాడు. అతడిని ఎక్కువ సేపు నిలువనీయకుండా పేసర్ సకీబ్ బౌల్డ్ చేయడంతో, పవర్‌ప్లేలో జట్టు 57/2 స్కోరుతో నిలిచింది. అటు రుతురాజ్ ఇబ్బందిపడినా.. కార్తీక్ మాత్రం బ్యాట్ ఝుళిపించాడు. ఎనిమిదో ఓవర్‌లో 4,6,4తో 16 రన్స్ అందించాడు. అయితే ఈ దశలో ప్యాట్ కమిన్స్ మరోసారి షాకిస్తూ తన వరుస ఓవర్లలో కార్తీక్, రుతురాజ్‌ల వికెట్లు తీశాడు. వీరి మధ్య మూడో వికెట్‌కు 42 పరుగులు జత చేరాయి. ఈ స్థితిలో బ్రెవిస్‌దూబే జోడీ కాస్త నిలదొక్కుకుంది. 14వ ఓవర్‌లో బ్రెవిస్ 4,4,6.. 16వ ఓవర్‌లో 6,4తో స్కోరు లోనూ కదలిక వచ్చింది. చివర్లో ఎదురుదాడికి దిగే క్రమంలో ఈ జోడీ వరుస ఓవర్లలో వెనుదిరగ్గా ఐదో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆఖరి ఓవర్‌లో పేసర్ హింగే తొమ్మిది పరుగులే ఇచ్చి ప్రశాంత్ (11) వికెట్ తీయడంతో సీఎస్‌కే 180 రన్స్‌తో ఫర్వాలేదనిపించింది.

స్కోరు వివరాలు

చెన్నై: సంజూ (సి) ఇషాన్ (బి) కమిన్స్ 27, రుతురాజ్ (సి) మలింగ (బి) కమిన్స్ 15, ఉర్విల్ (బి) సకీబ్ 13, కార్తీక్ (సి) నితీశ్ (బి) కమిన్స్ 32, బ్రెవిస్ (బి) మలింగ 44, దూబే (బి) సకీబ్ 26, ప్రశాంత్ (సి అండ్ బి) హింగే 11, అకీల్ (నాటౌట్) 3, ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 180/7; వికెట్ల పతనం: 1-31, 2-48, 3-90, 4-100, 5-159, 6-164, 7-180; బౌలింగ్: నితీశ్ 2-0-35-0, హింగే 3-0-37-1, కమిన్స్ 4-0-28-3, మలింగ 4-0-26-1, సకీబ్ హుస్సేన్ 4-0-34-2, శివాంగ్ 3-0-20-0.

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) జాన్సన్ (బి) అకీల్ 26, హెడ్ (సి అండ్ బి) ముకేశ్ 6, ఇషాన్ (సి) ఉర్విల్ (బి) అన్సు ల్ 70, క్లాసెన్ (స్టంప్డ్) శాంసన్ (బి) నూర్ 47, నితీశ్ (సి) ఉర్విల్ (బి) ముకేశ్ 11, సలీల్ (నాటౌట్) 10, స్మరణ్ (నాటౌట్) 5, ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19 ఓవర్లలో 181/5; వికెట్ల పతనం: 1-18, 2-56, 3-131, 4-153, 5-175; బౌలింగ్: ముకేశ్ 4-0-36-2, జాన్సన్ 3-0-26-0, అన్సు ల్ 4-0-46-1, నూర్ అహ్మద్ 4-0-40-1, అకీల్ హుస్సేన్ 3-0-21-1, శివమ్ దూబే 1-0-12-0.

పోరాడి ఓడిన సాత్విక్ జోడీ

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలో పర్యటించే భారత మహిళల హాకీ జట్టును సోమవారం ప్రకటించారు. ఈ జట్టుకు మిడ్‌ఫీల్డర్ సలీమా టేటె కెప్టెన్‌గా వ్యవహరించనుంది. డిఫెండర్ లాల్‌తన్‌తున్‌గ్లీ తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కించుకుంది. ఈ సిరీస్‌లో భాగంగా ఆతిథ్య జట్టుతో మన మహిళలు నాలుగు మ్యాచ్‌లు ఆడనున్నారు. తొలి రెండు మ్యాచ్‌లు ఈనెల 26, 27 తేదీల్లో మిగిలిన రెండు 29, 30న జరుగుతాయి.



ఇంగ్లండ్ దిగ్గజ క్రికెటర్ కన్నుమూత!

ఇంగ్లండ్ దిగ్గజ క్రికెటర్, మాజీ టెస్టు కెప్టెన్ మైక్ స్మిత్ (92) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మైక్ స్మిత్ (ఎంజేకే స్మిత్) ఇంట్లోనే తుదిశ్వాస విడిచినట్లు వార్విక్‌షైర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇంగ్లండ్ మేటి బ్యాటర్‌గా గుర్తింపు పొందిన మైక్‌స్మిత్ 50 టెస్టులు ఆడాడు. ఇందులో 25 టెస్టులకు ఇంగ్లండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 1958లో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మైక్ స్మిత్ 1972లో ఆస్ట్రేలియాతో చివరి టెస్టు మ్యాచ్ ఆడాడు. 50 మ్యాచ్‌ల్లో 2,278 పరుగులు చేసిన మైక్ స్మిత్ మూడు సెంచరీలు సాధించాడు. ఇక ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో 637 మ్యాచ్‌లాడి 40వేలకు పైగా పరుగులు సాధించిన మైక్ స్మిత్ 72 సెంచరీలు బాదాడు. అంతేకాదు 1991 నుంచి 2003 మధ్య వార్విక్‌షైర్ కౌంటీ బోర్డు చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన పదవిలో ఉన్న సమయంలోనే వార్విక్‌షైర్ కౌంటీల్లో చాలా టైటిల్స్ సాధించింది. మైక్ స్మిత్ కుమారుడు నీల్ స్మిత్ అప్పటి జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. క్రికెటర్‌గానే గాక రగ్బీ ప్లేయర్‌గానూ మైక్ స్మిత్ గుర్తింపు పొందాడు. 1956లో వేల్స్‌తో జరిగిన రగ్బీ మ్యాచ్‌లో ఇంగ్లండ్ తరపున క్యాప్ అందుకున్నాడు. ఇక మైక్ స్మిత్ మరణంపై వార్విక్‌షైర్ నివాళి అర్పించింది. కౌంటీ చాంపియన్‌షిప్‌లో భాగంగా గ్లామోర్గాన్‌తో మ్యాచ్‌కు ముందు వార్విక్‌షైర్ మైక్ స్మిత్ మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించింది.

బీసీసీఐ ఆర్టీఐ

పరిధిలోకి రాదు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పరిధిలోకి రాదని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) స్పష్టంజేసింది. దేశంలో క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు బీసీసీఐ ప్రైవేట్ సంస్థగా పని చేస్తోందని, అది తన సొంత నియమ నిబంధనలకు అనుగుణంగా నడుస్తున్నదని సీఐసీ కమిషనర్ పీఆర్ రమేశ్ పేర్కొన్నారు. బీసీసీఐ పని తీరుకు సంబంధించిన వివరాలు కోరుతూ.. ఆర్టీఐ ద్వారా బోర్డు సమాచారాన్ని పొందవచ్చా, లేదా అంటూ దాఖలైన కేసులో సీఐసీ సోమవారం ఈ తీర్పు వెలువరించింది. ఆర్టీఐ చట్టంలోని 2 (హెచ్)కింద బీసీసీఐని పబ్లిక్ అథారిటీగా ప్రకటిస్తూ 2018లో అప్పటి సమాచార కమిషనర్ ఎం.శ్రీధర్ ఆచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆమేరకు ప్రజా సంబంధ అధికారులను నియమించాలని, ఆర్టీఐ దరఖాస్తులను పరిశీలించేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన బీసీసీఐని ఆదేశించారు. ఈ తీర్పును మద్రాస్ హైకోర్టులో బీసీసీఐ సవాలు చేసింది. తాము ప్రభుత్వ నిధులు పొందడంలేదని, అందువల్ల తమది స్వతంత్ర సంస్థగా బోర్డు వాదించింది. ఈనేపథ్యంలో బోర్డు ఆర్టీఐ పరిధిలోకి వస్తుందో, రాదో తేల్చాలని సీఐసీకి మద్రాస్ హైకోర్టు సూచించింది. ఈక్రమంలో సీఐసీ కమిషనర్ రమేశ్ తాజా తీర్పు వెలువరించారు. తమిళనాడు సొసైటీల చట్టం కింద నమోదైనందువల్ల బీసీసీఐ అధికార సంస్థ కాదని ఆయన తేల్చారు. క్రికెట్ పాలన, అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొనే భారత జట్లను ఎంపిక చేసే కీలకమైన వ్యవహారాలను బీసీసీఐ పర్యవేక్షిస్తున్నా..అది ఆర్టీఐ పరిధిలోకి రాదన్నారు. అంతేకాదు..ఆర్టీఐ కింద బీసీసీఐ సమాచారాన్ని కోరుతూ దాఖలైన అప్పీలును రమేశ్ కొట్టివేశారు.

జట్టు కోసం.. ఇలాంటప్పుడు ధోని రిస్క్ చేయడు

ఒకవైపు ప్లేఆఫ్స్‌కు కీలక పోరు.. మరోవైపు దాదాపు ఏడాదిపాటు ఆటకు దూరమైన క్రికెటర్ పునరాగమనంపై ఊహాగానాలు.. ఇదీ ప్రస్తుతం చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితి! 12 మ్యాచుల్లో ఆరు విజయాలు సాధించిన సీఎస్‌కే.. మిగిలిన రెండింట్లో గెలిస్తే నాకౌట్‌కు చేరుకోవచ్చు. ఈ క్రమంలో చెపాక్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో నేడు తలపడనుంది. ఇప్పటివరకు మైదానంలోకి అడుగు పెట్టని ఎంఎస్ ధోని వస్తాడని అంతా భావిస్తున్నారు. ఇక్కడే రిటైర్‌మెంట్ ప్రకటన చేస్తాడని జోరుగా చర్చ జరుగుతోంది. అయితే, ఇలాంటి కీలక సమయంలో ధోని ఆడకపోవచ్చని.. సీఎస్‌కే జట్టు కూర్పును మార్చే అవకాశం లేదని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ ధోని బరిలోకి దిగితే మాత్రం అది సర్‌ప్రైజే అవుతుందంటూ వ్యాఖ్యానించాడు. ''ధోని పునరాగమనం చాలా కష్టమైంది. అతడు దాదాపు ఏడాది నుంచి క్రికెట్ ఆడటం లేదు. ప్రాక్టీస్ చేస్తున్నాడు. కానీ, రియల్‌టైమ్ గేమ్ ఆడలేదు. ఇప్పుడు సీఎస్‌కేకు చాలా కఠినమైన సవాల్ ఎదురుగా ఉంది. ప్లేఆఫ్స్‌కు వెళ్లాలంటే సన్‌రైజర్స్‌పై విజయం సాధించాలి. ధోని జట్టు

మనిషి. కాబట్టి, ఇలాంటి సమయంలో ఆడతాడని నేను అనుకోవడం లేదు. అభిమానిగా నేను కూడా ధోని ఆడకపోతే నిరుత్సాహ పడతా. అతడు మైదానంలో దిగితే ఎవరికి మాత్రం చూడాలని ఉండదు! కానీ, అతడు తన గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకున్నట్లు అనిపించలేదు'' అని సునీల్ గావస్కర్ అన్నారు. అలాగే సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌కు సంబంధించి బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎలాంటి మార్పులు ఉండవు. అకీల్ హుస్సేన్ తుది జట్టులోకి వస్తాడు'' అని చెపాక్‌లో సీఎస్‌కే చివరి మ్యాచ్‌పై తన అంచనాను వెల్లడించాడు.